# జుబేదా

**-శ్రీమతి సుజనారామం పెరుగు**

"మరోసారి ఆలోచించు జుబేదా!"

"లేదు మాలినీ! మరో ఆలోచనకసలు తావే లేదు. నీకు బాగా తెలుసు, నేనొక నిర్ణయమంటూ తీసుకున్నాక దాన్ని అమలుపర్చడమే తప్ప మరో ఆలోచనంటూ వుండదని" జుబేదా కంఠంలో ధ్వనించిన స్థిరత్వం గమనించాక నేను మరేమీ మాట్లాడలేకపోయాను. మౌనంగా తిరిగి వచ్చేశాను.

ఇంటికి వచ్చానన్న మాటేకాని మనసంతా అల్లకల్లోలంగా వుంది. జుబేదా తీసుకున్న నిర్ణయమే పురుగై నా మెదణ్ణి తొలుస్తూనే వుంది.

జుబేదా నా చిన్ననాటి స్నేహితురాలు. హైస్కూలు వరకూ కలిసి చదువుకోవటమే కాదు, అందులోని కష్టనష్టాలు కలిసి పంచుకున్నాం. ఏడో తరగతి నుండే జుబేదాకి బుర్ఖా తగిలించారు వాళ్లింటి వాళ్లు. ఈ రోజు నుంచే పెళ్లి సంబంధాలు చూడ్డం కూడ ఆరంభించారు. నేను పై చదువులకి పట్నం వెళ్తే, జుబేదాకి కరీంభాయ్‌తో పెళ్లైపోయింది. కరీంభాయ్ సంస్కారం, సహృదయత జుబేదా కాపురంలో సుఖసంతోషాలకి లోటు లేకుండా చేసింది. అలా ఓ మంచి జరిగినా, ఆ సంస్కారం, సహృదయతే ఆమెని కొడుకు ఆశతో అయిదుగురు ఆడపిల్లలకి తల్లిని కూడ చేసి పెట్టింది.

ఏడాదికో, రెండేళ్లకో ఓసారి నేను జుబేదాని కలుసుకున్నప్పుడల్లా పెరిగే ఆడపిల్లలతో పాటు పెరుగుతున్న ఆర్థిక యిబ్బందుల్నీ గమనిస్తూనే వున్నాను. కరీంభాయ్‌కే కాదు, జుబేదాకీ స్వాభిమానం కాస్త ఎక్కువనే చెప్పాలి. ఏ చిన్నా-చితకా సాయం చేద్దామనుకున్నా ససేమిరా వొద్దనేసేవాళ్లు. స్నేహితురాలికి సాయపడలేక పోయానన్న బాధ వున్నా, దాని స్వాభిమానం చూసి గర్వపడేదాన్ని వొకింతగా.

ఈ మధ్యే పిల్లల చదువులనీ, పరీక్షలనీ మా యిద్దరి వుద్యోగాలతో తీరికలేక ఐదేళ్లుగా జుబేదాని కలవడం కుదురలేదు. కాని కరీంభాయ్ మాత్రం ఓ రెండు మూడు సార్లు వచ్చి జుబేదా కబుర్లు చెప్పి వెళ్లాడు. కరీంభాయ్‌కి చెల్లెళ్లు లేకపోవడం నా పట్ల అభిమానానికి ముఖ్యమైన కారణం.

"మాలినీ! నువ్వోసారి తప్పనిసరిగా రావాలమ్మా!" అంటూ కరీంభాయ్ ఫోన్ చేయడంతో, యేదో జరగరానిదే జరిగి వుంటుందన్న సందేహంతో, ఆయన విన్నపాన్ని తిరస్కరించలేక నాల్రోజులు సెలవుపెట్టి హుటాహుటిన బైల్దేరి వచ్చాను.

స్టేషన్లో నన్ను రిసీవ్ చేసుకోడానికి వచ్చిన కరీంభాయ్ ముఖంలో ఎన్నడూ కనిపించని దైన్యం చూసి నివ్వెరపోయాను. "భయ్యా! ఏమైంది? జుబేదా ఎలా వుంది? అంత అర్జంటుగా ఎందుకు రమ్మన్నావ్?" అంటూ ప్రశ్నిస్తున్న నా మాటల్ని మధ్యలోనే అడ్డుకొని "ఏమీ కాలేదు. అంతా బాగానే వుంది. పనంతా నీతోనే. పదముందు యింటికెళ్దాం" అంటూ చేతిలోని సూటుకేసు అందుకుంటూ ముందుకు నడిచాడు. ఆ మాటల్లోనే యేదో జరిగిందన్న అసహనం, త్వరగా వెళ్లాలన్న ఆత్రుత ప్రస్ఫుటంగా కన్పించాయి. నాకంతా అయోమయంగా వుంది.

వాకిట్లో అడుగు పెట్టగానే ఎప్పట్లా 'అత్తమ్మా!' అంటూ ఎదురొచ్చే పిల్లలెవరూ ముందుకు రాలేదు. నా కోసం గుమ్మానికి కళ్లతికించి రెప్పలు కొట్టడం మర్చిపోయే జుబేదా కూడ లేదు. అంటే సమస్య ఎంతో తీవ్రమైందనే విషయం నాకర్థమైపోయింది. ఒక నిమిషం పాటు ఆ యింట్లోని నిశ్శబ్దం తుఫాను ముందటి ప్రశాంతతలా అనిపించింది.

"రా మాలినీ! బాగున్నావా?" లోపలి గదిలోంచి పీలగా విన్పించిన ఆ స్వరం జుబేదాది. అలిగి గదిలోనే కూచుందేమో. అలా అంతకు మునుపెన్నడూ జరగలేదన్న విషయం నాకు తెలుసు. లోపలికెళ్లాను.

"నేను బాగున్నా కాని నీ విషయం చెప్పు" అన్నాను.

"ముందు వెళ్లి ఫ్రెష్ అప్ అయిరా. తర్వాత అన్ని విషయాలూ చెప్తాను" అంది నిర్వికారంగా. ఉబ్బరించిన కళ్లు తప్ప జుబేదా ముఖంలో యే ఫీలింగూ కన్పించటం లేదు పైకి. రాత్రంతా తను యేడుస్తూనే, మధన పడుతూనే గడియలు లెక్కపెట్టిందన్న భావం ఆ ముఖంలో అద్దంలా తేటగా కనిపిస్తూనే వుంది.

"బషీరా! నువ్వెళ్లి అత్తమ్మకి నీళ్లు పెట్టిరా..." జుబేదా ఆ మాటలన్నది చిన్న కూతుర్తో అయినా మూడోది షకీలా క్షణాల్లో ఆ పని చేసిపెట్టింది.

నేను ముఖం కడుక్కొని ఫ్రెష్ అప్ అయ్యాను.

❍ ❍ ❍

ఎంత విచిత్రం!

పేదరికమంటే ఓ పూట పస్తో, వొంటినిండా ఆచ్ఛాదన లేకపోవడమో మరీ అధికంగానైతే ఏ రోగమో రొచ్చో పీడిస్తే మందులు కూడ కొనుక్కోలేని దీనస్థితో అనుకునేదాన్ని అప్పటివరకూ పేదరికం వ్యక్తిగతంగా ఓ మనిషిని దిగజార్చటం, పతనం దిశగా ఈడ్చుకెళ్లడం తెలుసు. కాని ఓ కుటుంబ పేదరికం కూతురు స్థానంలో తల్లిని నిలబెట్టేంత హీనస్థితికి కూడ కారణం అవుతుందని అప్పుడే అర్థమైంది నాకు.

సాజిదాకి అంటే పెద్దమ్మాయికి పెళ్లీడు వచ్చి ఆరేళ్లయిందన్న మాట నిజమే. ఆ మాటకొస్తే సాజిదా నుంచి బషీరా వరకు అయిదుగురు అమ్మాయిలూ పెళ్లి కెదిగినవారే.

ప్రభుత్వాసుపత్రిలో కాంపౌండరుగా వుద్యోగం చేస్తూ, ఆ యింటి నావని సుడిగుండాల్లో పడకుండా నెట్టుకొస్తూ కరీంభాయ్ తన కష్టాలు జుబేదాతో చెప్పుకోవడమే తప్ప పిల్లల ఎడమ చెవికి కూడ సోకకుండా జాగర్తపడ్డాడు. అయిదుగురాడపిల్లలూ హాఫిజె ఖురాన్‌లు (అంటే ఖురాను గ్రంథం కంఠతా పట్టినవాళ్లు. మన వేదాల్లాగే ముస్లిముల నాలుగు పవిత్ర గ్రంథాలూ శ్రుతులే.) మన పంచ సంధ్యల్లా ఐదుపూటలూ నమాజు చేసుకుంటూ పద్ధతిగా వుంటున్న వాళ్లే. ఆ విషయం ఆ యింట్లో వాళ్లకే కాదు ఆ వీధిలోని ముస్లిం కుటుంబాలంతటికీ తెలుసు. వాస్తవానికి ఆ కారణంగానే హిదాయతుల్లా అనే ఆటోడ్రైవరు సాజిదాని పైసా కట్నం లేకుండా పెళ్లి చేసుకోడానికి ముందుకొచ్చాడు. కట్నం బాధైతే తీరింది కాని, అమ్మాయికి పది తులాల బంగారం, మిగతా సంప్రదాయక నియమాలన్నీ తు.చ. తప్పక పాటించాల్సిందేనని అబ్బాయి తరఫువాళ్లు మూడుకాళ్ల కుందేళ్లయ్యారు. అంతా వెరసి రెండు లక్షల ఖర్చు తేలింది.

దాంతో ఆ సంబంధం తెగిపోయింది.

ఆ తెగిపోవటమే అసలు సమస్యకి ప్రారంభమైకూచుంది.

అరబ్బు షేకులకి హైదరాబాదులో అమ్మాయిల్ని చూసిపెట్టే బ్రోకరొకాయన ఈ విషయం పసిగట్టి, ఓ చల్లటి సాయంత్రం పూట కరీంభాయ్ యింట్లో నిప్పురవ్వ రాజేశాడు. పై నెలలో రానున్న ఓ కోటీశ్వరుడైన షేక్‌కి మూడునెలలు కాపురం చేయడానికో అందమైన అమ్మాయి కావాలి. శాస్త్రోక్తంగా నిఖా చేసుకుంటాడు. 'మెహర్' కింద ఎనిమిది లక్షల రూపాయలిస్తాడు. (మెహెర్ అంటే ముస్లిం సంప్రదాయంలో భార్యను వొదిలేస్తే ఆమెకు జీవన భృతిగా భర్త చెల్లించే భరణం. అది నిఖా రోజే ఖరారై పోతుంది.) ఆ డబ్బుతో మిగతా ఆడపిల్లల పెళ్లిళ్లు కూడ ఎలాంటి యిబ్బందుల్లేకుండా చేసేయొచ్చు.

"ఏమంటావ్ జుబేదా అక్కా!" అనడిగాడు ఇబ్రహీం.

జుబేదా పరదా చాటునుండి భర్త ముఖంలోకి చూసింది.

కరీంభాయ్ కళ్లల్లో కనిపించిన కోపాన్ని జుబేదా అర్థం చేసుకునే లోపలే తాండవిస్తున్న దారిద్ర్యం ఆమె నోరు తెరిపించేసింది.

"ఆలోచించి యే విషయమూ రేపటిలోగా కబురు చేస్తానన్నయ్యా!" అంటూ సమాధానంలోనే సగం అంగీకారం తెలిపేసింది జుబేదా.

జుబేదా మనసులోంచి అలాంటి ఆలోచనని వేళ్లతో సహా పెకలించి వేయాలన్న కరీంభాయ్ ప్రయత్నం అంతా పన్నీరై బూడిదలో యింకి పోయింది.

❍ ❍ ❍

నిజం చెప్పాలి.

ఆ మధ్య హైదరాబాదు ముస్లిం కుటుంబాల పేదరికంపైన సెటైర్ విసిరిన ఓ పాట విన్నాను. ఆ పాట పల్లవే ముస్లిం యింటి గుమ్మాలకు కట్టిన పరదాని తొలగించి లోపలి దృశ్యాన్ని నగ్నంగా కళ్లకి కట్టేస్తుంది.

"ఇది రాజధాని బాబూ!
లోన ఖాళీ పైన డాబు
సెకెండ్ హ్యాండ్ సూటూ బూటూ వేసే
ఫుట్‌పాత్ నవాబు...".

## పిలుపు!

పూదండల
గుబాళింపుల నుంచి
చప్పట్ల
సొంపైన శబ్దాల్నించి
బయటకు రా!
శాలువాల
ముసుగుల్లోంచి
కవీ! బయటకు రా!!

–గుడిమెట్ల గోపాలకృష్ణ

పేదరికంతో మగ్గుతున్న ముస్లింలకి ఫుట్‌పాత్ నవాబు అని ఎగతాళి చేయటం హైదరాబాదీ రివాజు. అయితే బడాయి కోసం మీసాలు దువ్వే వాళ్లంతా పేదరికం కాటు నుంచి బైటపడి రాత్రికి రాత్రి సంపన్నులై పోవాలని కలలు కంటున్న శివరాత్రు లెక్కువై పోయింది వొక్క హైదరాబాదు నగరంలోనే కాదు. భారతీయ దారిద్ర్యపు పుల్లని ద్రాక్ష యిది. ఒక్క ఇస్లాం మతానికే కాక అన్ని మతాల వారినీ పట్టి పీడిస్తున్న శతసహస్ర శిరచ్ఛేద చింతామణి యిది.

సరిగ్గా యిలాంటి చింతామణే జుబేదా మెదడులోనూ వేళ్లూనుకుంది. నలుగురు ఆడపిల్లల భవిష్యత్తు కోసం వొక ఆడపిల్ల బతుకును బలిపీఠం ఎక్కించాలనుకుంది జుబేదా.

ఆ వొక్క విషయంలో కరీంభాయ్ యింటి యజమానిగా కాకుండా ఆడపిల్లల తండ్రిగా జుబేదా ముందు వోడిపోయాడు. 'చక్కటి భర్త, చల్లని సంసారం, ముత్యాల్లాంటి పిల్లలు. మన పిల్లలకు మనం అందమైన జీవితాన్ని ఇవ్వాలే కాని వారిని దురదృష్టంలోకి తోసే హక్కు మనకెక్కడిది?' అన్న స్పృహ కూడ జుబేదాని గెలవలేక పోయిందా క్షణంలో.

తెల్లారేసరికంతా జుబేదా నిర్ణయం కరీంభాయ్ అంగీకారంగా ఇబ్రహీంను చేరింది. చేరిన వారం రోజులకంతా రియాద్ నుండి అరవై రెండేండ్ల అరబ్బు షేక్ హమీద్-బిన్-అహ్మద్ వచ్చి పెళ్లికూతుర్ని కళ్లారా చూసి వెళ్లాడు.

ఆ చూసి వెళ్లటమే కరీంభాయ్ కాపురంలో వల్లమాలిన చిచ్చుపెట్టిన సంఘటన.

కూతురు జీవితాన్ని బలిపశువు చేశానన్న వ్యసనంతో మథన పడుతున్న జుబేదా గుండెల్లో కురిసిన పూలవాన కరీంభాయ్ పాలిట పిడుగుల పాటై కూచుంది. వంద సునామీలు వొక్కటై అతనిపైన ఏకపక్షంగా దాడిచేసినంత పనైంది. ఆ సంఘటనతో కుదేలైపోయాడు కరీంభాయ్.

❍ ❍ ❍

“తలాక్ చెప్పం...

ఉలిక్కిపడ్డాడు కరీంభాయ్. ఆ మాట చెప్పింది అల్లాటప్పా మనిషి కాదు. సాక్షాత్తూ పాతికేళ్ల పైన తనతో కాపురం చేసిన భార్య. కష్ట సుఖాల్లో తను తడబడినపుడు తన్ను గుండెలకి హత్తుకొని వోదార్చిన యిల్లాలు. తన సహధర్మ చారిణి జుబేదా.

“నీకు పిచ్చెక్కింది...” అన్నాడు కరీంభాయ్.

“అవును... అయిదుగురాడపిల్లల్ని కనేటప్పుడు వయసు పిచ్చి. ఇప్పుడు వాళ్లు సుఖపడాలనే పిచ్చి. నిజంగానే నాకు పిచ్చెక్కింది. పిచ్చి పెళ్లాం కాపురానికి పనికిరాదు. తలాక్ చెప్పేయండి...”

ఈడ్చి జుబేదా చెంప పగులకొట్టాడు కరీంభాయ్.

అయినా జుబేదాలో మార్పు లేదు.

“మీ కోపం చల్లారేదాకా కొట్టండి. కాని ఈ రాత్రి ముగిసేలోగా మాత్రం తలాక్ చెప్పండి...” అంది దృఢమైన స్వరంతో. అది తెగింపు.

“ఇదేం రంధి జుబేదా! నువ్వనుకుంటున్నట్టే చేసినా, ఆ తర్వాత మన పిల్లల్ని ఎవరు పెళ్లి చేసుకోడానికి ముందుకొస్తారు, చెప్పు”

“పది లక్షల ఆస్తిపరుడి యింటి ముందు, అతడి పిల్లల్ని చేసుకోడానికి కుర్రాళ్లు క్యూ కడతారు. అందుకు కావలసిందల్లా మీరు తలాక్ అని మూడుసార్లు చెప్పడమే...” జుబేదా పట్టుపడితే మహా సిమెంట్‌తో గోడకట్టినట్టే.

“కనీసం మాటవరసకైనా మాలినితో వొకసారి మాట్లాడి చూడు. ఈ వయసులో నేను తలాక్ చెప్తే ఏమౌతుందో, నీ స్నేహితురాలైనా చెప్తుంది.”

“ఆ పని మీరే చేయండి...” ముక్తసరిగా జుబేదా అంగీకారం.

అరబ్బు షేక్ హమీద్-బిన్-అహ్మద్ ముందు సాజిదాని ప్రవేశపెట్టడానికి తోడొచ్చింది తల్లి జుబేదా. పెళ్లి చూపుల తంతు పూర్తై వెళ్లిపోయాక ఇబ్రహీంతో కబురు చేశాడు హమీద్. సాజిదాకైతే ఎనిమిది లక్షల మెహెర్. అదే ఆ స్థానం జుబేదా తీసుకుంటే పది లక్షలు. అంతగా ఆకర్షించింది జుబేదా ప్రౌఢ అందం హమీద్-బిన్-అహ్మద్‌ని.

కూతురికి బదులు బలిపీఠంపైన తల్లి!

జుబేదా తల్లిగా కోరుకుంటోంది కూతుళ్ల క్షేమమే. అందుకే గట్టిగా నిర్ణయం తీసుకుంది. సుఖాల కోరికలు చచ్చిపోయి, బాధ్యతల బరువులు హెచ్చిపోయిన తరుణంలో ముప్ఫై ఆరేళ్ల జుబేదా తీసుకున్న నిర్ణయాన్ని త్యాగమనాలో, పేదరికం అనాలో తెలీని సందర్భం.

నేను చెప్పి చూడటమన్నది కరీంభాయ్ ఆశమాత్రమే.

వాస్తవానికి సమస్యకి పరిష్కారం చూపే మంత్రదండం కరీంభాయ్ చేతుల్లోనే వుంది. ఎందుకంటే అతనిప్పుడు అయిదుగురాడపిల్లల తండ్రి! ■